సాక్షి
బాపట్ల
మంగళవారం, 26, ఆగస్టు, 2025



ఎరువుల నిల్వల పరిశీలన

నాదెండ్ల: సాతులూరులోని ఎరువుల రైల్వే రేక్ పాయింట్‌ను డీఏఓ ఎం.జగ్గారావు సోమవారం సందర్శించారు. సరుకు నిల్వల రికార్డులను ఆయన పరిశీలించారు.



దుర్గమ్మకు విరాళాలు

విజయవాడ వెస్ట్ (ఇంద్రకీలాద్రి): కనక దుర్గమ్మకు పలువురు భక్తులు సోమవారం విరాళాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధి, నిత్యాన్నదాన పథకాలకు విరాళాలిచ్చారు.



స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పెనమలూరు: మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం కృష్ణా జిల్లా పోరంకిలో జేసీ గీతాంజలి శర్మతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

ఆర్‌టీఈ ప్రవేశాల రెండో జాబితా విడుదల

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 1వ తరగతి ఉచిత ప్రవేశాల రెండో జాబితా విడుదల చేశారు. ఈ మేరకు డీఈవో ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలో 132 మంది విద్యార్థులు ఎంపికైనట్టు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు 31వ తేదీలోగా సంబంధిత సర్టిఫికెట్లను ఆయా పాఠశాలల్లో సమర్పించి, తమ పిల్లల ప్రవేశాలను నిర్ధారించుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత మండల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ కార్యాలయాలలో సంప్రదించాలని తెలిపారు.

మట్టి గణపతిని పూజిద్దాం



నరసరావుపేట: ఈ ఏడాది సహజ సిద్ధమైన రంగులతో చేసిన మట్టి గణపతినే అందరం పూజిద్దామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన ప్రచార పోస్టర్‌ను కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. పర్యావరణాన్ని రక్షించేందుకు అందరూ సహకరించాలని పేర్కొన్నారు. డీఆర్‌ఓ ఏకా మురళి, ఏపీపీసీబీ పర్యావరణ ఇంజినీరు ఎండీ నజీమాబేగం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్హత ఉంటే పింఛను ఇస్తాం
–జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి


బాపట్ల: పింఛను విషయంలో అర్హత కలిగిన దివ్యాంగులకు న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్‌ఎస్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఎక్కువగా ఈ సమస్యపై దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. అనర్హులు పింఛను పొందుతున్నారనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలన చేపట్టిందని తెలిపారు. సర్టిఫికెట్ల పునఃపరిశీలనకు తేదీ కేటాయించి దివ్యాంగులకు తెలియజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మల్లేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



పెదకాకాని: పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్‌ఎన్ చక్రవర్తి దంపతులు ప్రత్యేక పూజలు జరిపించారు. వారికి ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన న్యాయమూర్తి దంపతులు ముందుగా రాహు కేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి అభిషేక సేవ, అమ్మవారికి అష్టోత్తరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గుంటూరు జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి దంపతులు సైతం భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఇరువురు న్యాయమూర్తులకు వేద ఆశీర్వచన మండపంలో ఆలయ స్థానాచార్యులు, అర్చకస్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ అందజేశారు.

పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 8,216 క్యూసెక్కులు సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 306 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,875, క్యూసెక్కులు, తూర్పు కాలువకు 712, పశ్చిమ కాలువకు 292, నిజాంపట్నం కాలువకు 528, కొమ్మూరు కాలువకు 2,940 క్యూసెక్కులు, బ్యారేజీ నుంచి సముద్రంలోకి 3,15,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అయినవారి కోసమేనా

టెండర్ల వాయిదాల పర్వం

- రూ.793.21 కోట్లతో పది పనులకు టెండరు నోటీసు
- ఇందులో మూడు సేవలు, ఏడు నిర్మాణ, నిర్వహణ పనులు
- రూ.683.33 కోట్లతో రాజధానిలో సమ్మిళిత పనులు
- రూ.109.88 కోట్లతో విజయవాడ, గుంటూరులో 4 రోడ్ల నిర్మాణాలు
- గుంటూరు ఐఆర్‌ఆర్ పనికి ఆరు టెండర్లు దాఖలు
- ఫైనాన్షియల్ బిడ్ ఓపెన్‌కు మీనమేషాలు
- విజయవాడలో మూడు పనులకు మూడు వాయిదాలు టెండర్లు
- ఏపీసీఆర్‌డీఏ టెండర్లలో తిరకాసులెన్నెన్నో...



ఆర్‌టీవో ఆఫీసు వద్ద ఇన్నర్‌రింగ్ రోడ్ సర్కిల్

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఏపీ సీఆర్‌డీఏ ఆహ్వానించిన టెండర్లను నిర్దిష్ట సమయంలో తెరవకుండా మీనమేషాలు లెక్కిస్తూ తమకు అనుకూలురైన కాంట్రాక్టర్ల కోసం ఎదురుచూస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్‌కు బిడ్లు దాఖలైనప్పటికీ సహేతుక కారణాలేవీ లేకుండానే ఫైనాన్షియల్ బిడ్ తెరవకుండా వాయిదా వేస్తుండగా, కొన్ని టెండర్లకు సంబంధించి సాంకేతిక బిడ్‌లను కూడా ఓపెన్ చేయడం లేదని టెండరుదారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. తమకు అనుకూలురైన బడా కాంట్రాక్టర్లకు పనికట్టబెట్టడానికే వాయిదాల వ్యవహారాలను ఏపీసీఆర్‌డీఏ ఉన్నతాధికారుల ద్వారా కూటమిలోని పెద్దలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లను పక్కన పెట్టి అన్ని పనులను ఒకటిగా చేసి పెద్దమొత్తంతో టెండరు పిలిచి బడా కంపెనీలకు అప్పజెప్పి భారీస్థాయిలో పర్సంటేజీలు రాబట్టుకోవచ్చనే వ్యూహంలో భాగంగానే వాయిదాల పర్వమని స్పష్టమవుతోంది.

పది పనులకు టెండర్లు

- అమరావతి రాజధాని, విజయవాడ, గుంటూరు నగరాలలో పది పనుల కోసం ఏపీసీఆర్‌డీఏ రూ.793.22 కోట్లతో టెండర్లను ఆహ్వానించింది. పై మొత్తంతో ఏడు నిర్మాణ, నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉండగా... తక్కిన మూడు టెండర్లు సేవలకు సంబంధించినవి. నిర్మాణ, నిర్వహణ పనులకుగాను టెండరు డాక్యుమెంట్లను జూలై 11 నుంచి ఆగస్టు 8వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. నిర్దేశిత బిడ్లకు ఆగస్టు ఒకటి నుంచి 13వ తేదీలోగా టెండర్లు దాఖలు చేయడానికి గడువు విధించింది.
- గుంటూరు జేకేసీ కాలేజీ మార్గంలోని స్వర్ణ భారతి నగర్ వద్ద నుంచి పెద్దపలకలూరు వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు మూడో ఫేజ్ కింద నిర్మాణానికి రూ.34,87,28,545కు టెండరు పిలిచింది. ఆగస్టు ఏడో తేదీ టెండరు దాఖలుకు గడువిచ్చింది. టెక్నికల్ బిడ్లు తెరవగా ఆరు టెండర్లు దాఖలైనట్లు గుర్తించారు. టెండరు నిబంధనల ప్రకారం 8వ తేదీ ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవాలి. ఇప్పటివరకు ఆ పనిచేయలేదు. కారణాలేంటని తాము పలుసార్లు సంబంధిత అధికారులను సంప్రదించినా సమాచారం ఇవ్వడం లేదని టెండరుదారులు 'సాక్షి'కి తెలిపారు.
- విజయవాడ నగరంలోని బల్లెంవారివీధి జంక్షన్ నుంచి నిడమానూరు మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు (హెచ్‌టీ లైన్ రోడ్) బీటీ హాట్ మిక్స్‌తో రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్ వంటి పనులకు రూ. 26,51,89,656 మేరకు టెండరు ఆహ్వానించింది. అదేవిధంగా మహానాడు రోడ్డు నుంచి బల్లెంవారి వీధి నుంచి పోరంకి, నిడమానూరు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, ఇతర పనులకు రూ. 25,52,45,567 మరో టెండర్‌ను పిలిచింది. బందరు రోడ్డు నుంచి హెచ్‌టీ లైన్ జంక్షన్ వరకు బల్లెంవారి వీధి రోడ్డు విస్తరణ, సెంట్రల్ డివైడర్, లైటింగ్ పనుల నిమిత్తం 22,96,21,066 టెండరు ఆహ్వానించింది. పై మూడు పనులకు సంబంధించి ఆగస్టు 11వ తేదీ టెక్నికల్ బిడ్ తెరవనున్నట్లు పేర్కొన్నప్పటికీ ఆ మేరకు చేయలేదు. ఏ కారణం లేకుండానే 19వ తేదీ టెక్నికల్ బిడ్ ఓపెన్ చేస్తున్నట్లు చెప్పిన అధికారులు అలా చేయకపోగా మరోసారి ఈ నెల 29వ తేదీకి వాయిదా వేయడం పరిశీలనాంశం. మూడు పనులకు సంబంధించిన టెక్నికల్ బిడ్‌ను ఓపెన్ చేయకుండా మూడు పర్యాయాలు ఎందుకు వాయిదా వేశారనేది అంతుబట్టని అంశంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు ఫైనాన్షియల్ బిడ్ ఓపెన్ చేయకపోవడం, విజయవాడలోని మూడు పనుల టెండర్లను ఇలా వాయిదాలు వేయడం వెనుక కూటమి ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్లు స్పష్టమవుతోందని అంటున్నారు. బడా గుత్తేదారులకు పనులు అప్పగించాలనే వ్యూహంతో ఉన్నప్పుడు ఏపీ సీఆర్‌డీఏ టెండర్లు పిలవడం ఎందుకని నిలదీస్తుండటం చర్చనీయాంశంగా మారింది.



స్వర్ణభారతి నగర్ నుంచి పేరేచర్ల వెళ్లే ఇన్నర్‌రింగ్ రోడ్

ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి



బాపట్ల: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. వినతి పత్రాలను స్వయంగా స్వీకరించి, కొన్నింటికి తక్షణమే పరిష్కారం చూపించారు. కొన్నింటిని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 190 వినతులు అందాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

ప్రభుత్వ భూములను ఆక్రమించి భవనాలు నిర్మిస్తే కూల్చివేయాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బాపట్ల డీఎల్‌డీవోకు ఆదేశించారు. స్వామిత్వ సర్వే పురోగతిపై ఎంపీడీవోలతో ఆయన సమీక్షించారు. ప్రతిరోజు ఈ తరహా సమీక్ష నిర్వహిస్తానని, అధికారులందరూ నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీక్షణ సమావేశం నిర్వహిస్తారని, అందుకు అధికారులందరూ నివేదికలతో రావాలని పేర్కొన్నారు. పీ4 కార్యక్రమంలో నీడ్ బేస్డ్ సర్వేను వందశాతం పూర్తి చేయాలని ఆయన ముఖ్య ప్రణాళిక అధికారిని ఆదేశించారు. తల్లికి వందనం పథకంలో ఈకేవైసీ పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించి ఆపరేషన్లు చేసిన డాక్టర్లకు, ఏఎన్‌ఎంలకు ప్రోత్సాహక నగదు అందజేశారు. ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, బాపట్ల ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ

- అడ్డగోలుగా పింఛన్ల రద్దు తగదు
- మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి వినతి పత్రం అందిస్తున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన

బాపట్ల: దివ్యాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుందని మాజీ డెప్యూటీ స్పీకర్, పార్టీ బాపట్ల సమన్వయకర్త కోన రఘుపతి పేర్కొన్నారు. దివ్యాంగుల పింఛన్లు తొలగించటంపై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి ఆయన వినతి పత్రం అందించారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అర్హులైన వారికీ పింఛన్లు తొలగించారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విలేకరుల సమావేశంలో కోన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది లక్షల మంది దివ్యాంగులకు పింఛన్లు ఉంటే వాటిలో లక్ష మందికి తొలగిస్తూ నోటీసులు జారీ చేయటం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే సమయంలో అన్ని రకాల పింఛనుదారుల సంఖ్య 33 లక్షలు ఉండగా.. దానిని రెట్టింపు చేసినట్లు వివరించారు. అర్హులైన వారందరికీ పెన్షన్ ఇచ్చేలా ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా తొలగింపునకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. విచారణ పేరుతో అన్ని పథకాలు తొలగిపోతాయని తెలిపారు. దివ్యాంగులకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉద్యమం చేపడితే తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని సూచించారు. అలాంటి కేసులకు భయపడేదే లేదన్నారు. చల్లా రామయ్యను ఓదార్చి సెల్ టవర్ నుంచి దించే ప్రయత్నం చేసేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులపై కూడా అక్రమ కేసులు పెట్టారన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేస్తామని కోన చెప్పారు. దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, తన్నీరు అంకమ్మరావు, జోగి రాజా పాల్గొన్నారు.

జగనన్న కాలనీని గ్రామంలో కలపొద్దు

ఉప్పరపాలెం సమీపంలోని జగనన్న కాలనీని మూలపాలెం లో చేర్చేలా కూటమి ప్రభుత్వం ప్రయత్నించటం సరికాదని కోన రఘుపతి సూచించారు. మూలపాలెం ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన గ్రామమని, దీంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కూడా వస్తున్నాయని గుర్తుచేశారు. ఈ మేరకు సర్పంచ్ బి.అనిల్ ఆధ్వర్యంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారని తెలిపారు.

పండుగ తరువాతే డీఎస్సీ నియామక ప్రక్రియ



ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ వినాయకచవితి పండుగ తరువాతే ప్రారంభం కానుంది. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ–2025 ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులతో వివిధ కేటగిరీల వారీగా ఆయా పోస్టులకు ఎంపికైన వారికి పాఠశాల విద్యాశాఖ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఈనెల 28 నుంచి చేపట్టనుంది. విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం ప్రారంభం కావాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను మంగళవారానికి వాయిదా వేసిన అధికారులు వినాయకచవితి పండుగ సెలవు దృష్ట్యా మరోసారి వాయిదా వేశారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను గురువారం నుంచి చేపట్టేందుకు షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం 'సాక్షి'కి తెలిపారు.

ఏసీ కళాశాల వేదిక

ఉమ్మడి గుంటూరు జిల్లాలో భర్తీ చేయనున్నట్లు డీఎస్సీ నోటిఫికేషన్‌లో పొందుపర్చిన 1,143 పోస్టులకు గతంలో 25,067 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో మొత్తం 43,570 దరఖాస్తులు అందాయి పురుషులు 8,431, మహిళలు 16,636 మంది ఉన్నారు. పరీక్షల ఫలితాలను ఇటీవల విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను గురువారం నుంచి గుంటూరులోని ఏసీ కళాశాలలో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యాశాఖ కార్యాలయం ద్వారా నేరుగా సమాచారాన్ని పంపుతారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు చేపడతామని డీఈఓ సీవీ రేణుక చెప్పారు.

'వర్రీ' నారు!

కొండెక్కిన ధరలతో కర్షకులు విలవిల

- భారీ వర్షాలతో నీటి మునిగిన పొలాలు
- అదును దాటిపోతుందనే ఆందోళనలో అన్నదాతలు
- అధిక ధరలు వెచ్చించి నారు కొనుగోలు
- సెంటు రూ. 2 వేలు పలుకుతున్న వైనం



సుదూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్‌లో నారు తీసుకొస్తున్న రైతులు

బాపట్ల టౌన్: అతివృష్టి... అనావృష్టి... పరిస్థితుల మధ్య ఈ ఏడాది అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు. మొన్నటి వరకు కాలువల ద్వారా నీరు విడుదల కాకపోవడం, వరుణుడు కరుణించకపోవడంతో అసలు సాగు చేస్తామో లేదోనన్న సందిగ్ధంలో రైతన్నలు ఉండేవారు. నార్లు పోసుకునేందుకు కూడా ముందుకు రాలేదు. నాటు వేసిన తర్వాత ఇటీవల భారీ వర్షాలకు ముంపునకు గురై నిండా మునిగారు. ఇప్పుడు మళ్లీ నాట్లు వేయాలంటే అదనపు భారం తప్పడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో అత్యధికంగా ఈ ఏడాది వెద పద్ధతిలో సాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో రికార్డు స్థాయిలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరుణుడికి తోడు కాలువలు పొంగిపొర్లడంతో జిల్లాలోని లంకగ్రామాలు, తీరప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. జిల్లాలోని బాపట్ల, రేపల్లె, కొల్లూరు, నిజాంపట్నం, నగరం, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, చీరాల, చినగంజాం, వేటపాలెం ప్రాంతాల్లో సుమారు 40 వేల హెక్టార్లలో వెద పద్ధతిలో, నాట్లు రూపంలో వరి సాగు చేశారు. భారీ వర్షాల కారణంగా పొలంలో నిలిచిన నీరు 10 రోజులకుపైగా నిలిచి ఉండటంతో పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. తిరిగి మరోసారి వెద పెట్టేందుకు అవకాశం లేకపోవడంతో రైతులు తప్పనిపరిస్థితిలో నార్లు కొనుగోలు చేసి నాటేందుకు సిద్ధమయ్యారు.

డిమాండ్ పెరిగిందిలా...

నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పొలాలు ఉరకెక్కే అవకాశం ఉండటంతో రైతులు సుదూర ప్రాంతాల నుంచి నారు కొనుగోలు చేసి నాట్లు వేసే పనిలో నిమగ్నం అయ్యారు. రైతుల అవసరాలను అవకాశంగా భావించిన వ్యాపారులు నారు ధరలను ఒక్కసారిగా అమాంతం పెంచేశారు. జిల్లా నలుమూలల నుంచి నార్లు కొనుగోలు చేసేందుకు కర్లపాలెం, బాపట్ల మండలాల్లోని మెరక ప్రాంతాల రైతులు అధిక సంఖ్యలో రావడంతో ధరలు కొండెక్కాయి. సాధారణంగా గతంలో నారు ధరలు సెంటు రూ. 450 నుంచి రూ.600 వరకు మాత్రమే ఉండేంది. డిమాండ్ పెరగడంతో సెంటు నారు రూ. 2000 దాటింది. గత్యంతరం లేని పరిస్థితిలో రైతులు కొనుగోలు చేస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో విక్రయం

బాపట్ల మండలంలోని దరివాదకొత్తపాలెం, వెదుళ్లపల్లి, నందిరాజుతోట, కొండుబోట్లవారిపాలెం, చిల్లరగొల్లపాలెం, కర్లపాలెం మండలంలోని నందాయపాలెం, నల్లమోతువారిపాలెం, కర్లపాలెం, చీరాల మండలంలోని ఈపూరుపాలెం, బోయినవారిపాలెం, తోటవారిపాలెం ప్రాంతాల్లో నారు లభ్యం అవుతోంది. గరువు నేలలు కావటంతో ఇక్కడ నారుకు మంచి డిమాండ్ ఉంది. ఆయా గ్రామాల్లో రైతులు నారును విక్రయిస్తున్నారు.

పెరిగిన ఖర్చుల భారం

నేను ఈ ఏడాది నాలుగు ఎకరాలు వెద పద్ధతిలో సాగు చేశా. ఇప్పటికే రెండుసార్లు వెద పెట్టినందుకు ఒక్కో ఎకరాకు రూ. 12 వేల చొప్పున ఖర్చు పెట్టాను. ప్రస్తుతం సెంటు నారు రూ. 2 వేల చొప్పున నాలుగు ఎకరాలకు కొనుగోలు చేశా. ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై అందజేయాలి.

– గేరా శ్యామ్యూల్, ఈతేరు

ఈ ఏడాది అన్నీ నష్టాలే

ఈ సంవత్సరం ఏ గడియలో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టామో కానీ అన్ని నష్టాలే వెంటాడుతున్నాయి. ప్రస్తుతం సెంటు నారు రూ. 2 వేలకు పైగా పలుకుతోంది. కౌలు చెల్లించుకుంటూ అప్పులు తీసుకొచ్చి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితికి వచ్చాం. మాలాంటి చిన్న, సన్నకారు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కోటేశ్వరరావు, పూండ్ల

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.





సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.

సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

క్లుప్తంగా

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఓ నగల దుకాణంలో రెండు బంగారు ఉంగరాలు చోరీ చేసిన ఘటనలో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ పి.సుబ్బారావు సోమవారం తెలిపారు. వివరాలు.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన తోకల రాజేశ్వరి, మంగళగిరిలోని గండలయ్యపేటకు చెందిన ఇట్టా ప్రసాద్ మార్కాపురంలోని ఓ నగల దుకాణానికి వెళ్లారు. వ్యాపారిని మభ్యపెట్టి అసలు నగల స్థానంలో డూప్లికేట్‌వి ఉంచి చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈనెల 24న బోడపాడు రోడ్డులో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 10.52 గ్రాముల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



బాపట్లటౌన్: స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన మరుప్రోలు ఏడుకొండలు రెడ్డి ద్విచక్రవాహనంపై గడియారస్తంభం నుంచి పాతబస్టాండ్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో వెనుకవైపు నుంచి వచ్చిన ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో మరుప్రోలు ఏడుకొండలురెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పట్టణ సీఐ రాంబాబు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

‘ఉపాధి’కి అవినీతి తూట్లు!

- 21 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ
- రూ.4 కోట్ల మేర అవినీతి జరిగిందని గుర్తింపు



బోగస్ మస్టర్లతో అవినీతికి పాల్పడ్డ వారి గురించి డ్వామా పీడీకి వివరిస్తున్న మాజీ సర్పంచ్ బాలకృష్ణ

బల్లికురవ: ఉపాధి హామీ పథకం మండలంలో అపహాస్యం పాలైంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మండంలోని 21 గ్రామ పంచాయతీల్లో 645 పనులను రూ.12 కోట్లతో చేపట్టినట్లు అధికారులు ప్రకటించారు. మస్టర్లు, కొలతల్లో వ్యత్యాసాలు, మొక్కలు నాటని వైనం, చేసిన పనులే మళ్లీ చూపుతూ రూ.కోట్ల ప్రజాధనం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లింది. జిల్లా, మండల స్థాయి అధికారులు పర్సంటేజీలకు అలవాటు పడి ఇవేమీ పట్టించుకోలేదు. గ్రామాల వారీగా సామాజిక తనిఖీల్లో అవినీతి జరిగినట్లు నిర్ధారించాయి. బల్లికురవలో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగిన బహిరంగ ప్రజావేదికలో ఈ మేరకు వెల్లడించారు. ఇది జరిగి 20 రోజులైనా అక్రమార్కులపై చర్యలు లేవని కూలీలు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

పైపైనే విచారణ

నక్కబొక్కలపాడు, కొమ్మినేనివారిపాలెం, వేమవరం, అంబడిపూడి, కొణిదెన, చెన్నుపల్లి, గొర్రెపాడు, వల్లాపల్లి, కె.రాజుపాలెం, కూకట్లపల్లి, వెలమవారిపాలెం గ్రామాల్లో రూ. 1.5 కోట్ల మేర పనులకు క్వాలిటీ కంట్రోల్ బృందం నివేదికలు ఇవ్వాల్సి ఉంది.

మల్లాయపాలెం గ్రామంలో సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ ఉద్యోగులు, 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 70 మందికి బోగస్ మస్టర్లు వేసి రూ. 20 లక్షలు వరకు స్వాహా చేశారని జిల్లా కలెక్టర్ వెంకట మురళికి, డ్వామా పీడీ విజయలక్ష్మికి ఆధారాలతో మల్లాయపాలెం మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ ఫిర్యాదు చేశారు. విచారణను గతంలో ఎంపీడీవో పాండురంగస్వామికి కలెక్టర్ అప్పగించారు. ఆయన స్థానిక ఏపీవో జి. రమాదేవికి ఆ బాధ్యత అప్పగించారు. ఏపీవో భాగస్వామ్యం ఉన్నా అధికారులు ఆమెకే విచారణ బాధ్యతలు అప్పగించడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



మల్లాయపాలెంలో బోగస్ మస్టర్లు అవినీతిపై విచారణ చేపడుతున్న ఏపీవో రమాదేవి

అలా విచారణ తగదు



ఉపాధి పనుల్లో అవినీతిపై తగిన ఆధారాలతో ఫిర్యాదు చేశా. విచారణకు ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక ఏపీవోను పంపడమేంటి? ఆమె ఫీల్డ్ అసిస్టెంట్‌ను వెంటబెట్టుకుని విచారణ ఎలా చేస్తారు? అక్రమాలను కప్పిపుచ్చి అధికారులు తప్పుడు నివేదికలు సమర్పించారు. తగిన ఆధారాలతో పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం. ఇతర మండలాల అధికారుల విషయంలో మళ్లీ విచారణ చేపట్టాలి.

– అబ్బారెడ్డి బాలకృష్ణ, మాజీ సర్పంచ్

రూ.4 కోట్ల మేరకు అవినీతి?

ఊరు పేరు	అవినీతి
	మొత్తం (రూ.లక్షల్లో)
వి.కొప్పరపాడు	50
ఉప్పుమాగులూరు	39.67
అంబడిపూడి	49.33
ముక్తేశ్వరం	35
బల్లికురవ	12
వల్లాపల్లి	1.57
మల్లాయపాలెంలో	8
వెలమవారి పాలెం	1.04
వైదన	3.78
కొప్పరపాలెం	8.3
కొమ్మినేనివారి పాలెం	0.96
వేమవరం	0.80
గుంటుపల్లి	0.65
కొణిదెన	0.16
చెన్నుపల్లి	0.16
గొర్రెపాడు	0.04

‘బార్’లకు నేటితో ముగియనున్న గడువు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ

రేపల్లె: ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన బార్ పాలసీలో భాగంగా బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వహణ అనుమతులు పొందేందుకు నేడు 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు దరఖాస్తు గడువు ముగుస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తెలియజేశారు. స్థానిక ప్రొహిబిషన్ కార్యాలయంలో సోమవారం రెస్టారెంట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపే వారితో సమావేశం నిర్వహించారు. మూడు సంవత్సరాల పాటు బార్ అండ్ రెస్టారెంట్ నడుపుకొనేందుకు అనుమతులు లభిస్తాయన్నారు. రేపల్లెలో నాలుగు బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటుకు అనుమతులు లభించాయన్నారు. 2025 అక్టోబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31వ తేదీవరకు మూడు సంవత్సరాల పాటు బార్ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. దరఖాస్తులు చేసుకునేవారు రూ.5 లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజు, రూ 10,000 అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తెలియజేశారు. బార్లకు అందిన దరఖాస్తులను ఈ నెల 28వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ సమక్షంలో బాపట్లలో లాటరీ విధానంలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. బార్ పాలసీ విధి విధానాలను తెలియజేశారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

చీరాల అర్బన్: రెస్టారెంట్ అండ్ బార్‌ల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నాగరాజు తెలిపారు. నోటిఫికేషన్‌ను అనుసరించి సోమవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఔత్సాహికులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి మద్యం షాపుల యజమానులు, రియల్ ఎస్టేట్, రిసార్ట్స్ నిర్వాహకులు, బెల్లం అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు. హాజరైన వారితో ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌పై మాట్లాడారు. ఆసక్తి ఉన్న వారు టెండర్లు వేయాలని, లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. రెస్టారెంట్ అండ్ బార్‌ల కోసం దరఖాస్తులు ఔత్సాహికులు ప్రతి ఒక్కరూ వేయాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాటర్‌రేస్ పోటీల్లో ద్వితీయ స్థానం

నగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్య చౌదరి చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో సోమవారం వాటర్‌రేస్‌లో జాతీయస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన పాగిడి గాయత్రికి అభినందన సభ నిర్వహించారు. బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన వాటర్ రేస్ పోటీల్లో గాయత్రి ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించిందన్నారు. కృషి, పట్టుదల, అంకిత భావంతో పనిచేస్తే విజయాలు సులువుగా సాధించవచ్చునన్నారు. అనంతరం గాయత్రిని కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబమూర్తి పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన గాయత్రి

విద్యా పురోగతికి ఉపాధ్యాయుల కృషి కీలకం

సహిత విద్య జిల్లా సమన్వయకర్త జ్యోత్స్న

చీరాల అర్బన్: ప్రత్యేక అవసరాల పిల్లల విద్యా పురోగతికి సహిత విద్య ఉపాధ్యాయులు కృషి చేయాలని సహిత విద్య జిల్లా సమన్వయకర్త జ్యోత్స్న పేర్కొన్నారు. సోమవారం ఆమె ఈపురుపాలెంలోని భవిత కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి పిల్లల విద్యా ఉన్నతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యా పురోగతికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రత్యేకంగా స్పీచ్ థెరపీ, హియరింగ్, విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి భవిత కేంద్రానికి తీసుకువచ్చేలా తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో భావానారుషిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం హేమంత్‌కుమార్, ఐఈఆర్టీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సహిత విద్య జిల్లా సమన్వయకర్త జ్యోత్స్న

ఆటోను ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

నలుగురికి గాయాలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ముందు వెళ్తున్న ఆటోను వెనకగా కారు ఢీకొనగా.. ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం జంక్షన్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపిన వివరాల మేరకు.. వినుకొండ మండలంలోని పొట్లూరు గ్రామం నుంచి సంతమాగులూరు మండలంలోని సజ్జాపురం వెళ్తున్న ఆటోలో డ్రైవర్‌తో సహా ఆరుగురు ప్రయాణిస్తున్నారు. ఈక్రమంలో మార్గమధ్యంలోని పుట్టావారిపాలెం జంక్షన్ దాటిన తరువాత పెట్రోలు బంకు ముందు ఉన్న బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు అతి వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న ప్రయాణికుడు సజ్జాపురం గ్రామానికి చెందిన నంబూరి దావీదు (62) ఎగిరి బ్రిడ్జి పక్కన పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో నలుగురికి గాయాలయ్యాయి. వారిని స్థానిక వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ పట్టాభిరామయ్య ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



ప్రమాదానికి గురైన ఆటో



మృతిచెందిన దావీదు

శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న విగ్రహం తొలగింపు

- తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ స్థానంలో మరో విగ్రహం ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు
- ముగిసిన విగ్రహ వివాదం

పెదకాకాని: శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ వివాదానికి దారి తీయడంతో నిర్వాహకులు స్వచ్ఛందంగా రాత్రికి రాత్రే ఆ విగ్రహాన్ని తొలగించి వేరే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడులో ఈనెల 24వ తేదీన శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు టీడీపీ నాయకులు ప్రకటించారు. సమాచారం అందుకున్న యాదవ సంఘం నేతలు, బీసీవై పార్టీ నేతలు 23వ తేదీన తక్కెళ్ళపాడులో విగ్రహావిష్కరణ వద్దకు చేరుకుని, ఎన్‌టీఆర్‌ను శ్రీకృష్ణుని రూపంలో ఆవిష్కరించడం అంటే శ్రీకృష్ణుడికి ప్రతి ఇంటా పూజలు చేసే యాదవ కులాన్ని, హిందువులను అవమానించడమేనని ఈ విగ్రహావిష్కరణ నిలిపివేయాలని స్థానికులను కోరారు. అయినప్పటికీ ఆదివారం మండల టీడీపీ, గ్రామ పెద్దలు శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ విగ్రహం నుంచి పిల్లనగ్రోవి, నెమలి పింఛం తొలగించారు. మరోసారి అదే విగ్రహం చేతిలో కత్తి పెట్టారు. అదే రోజు సాయంత్రం నిరసన తెలియజేసేందుకు అక్కడికి చేరుకున్న యాదవ సంఘం నాయకులు, బీసీవై పార్టీ ప్రతినిధులకు టీడీపీ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అప్పటికే బీసీవై పార్టీ అధినేత సోమవారం ఛలో తక్కెళ్ళపాడు కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ పిలుపులో భాగంగా యాదవసంఘ ప్రముఖులు గుంటూరు నగరంలో సమావేశమయ్యారు. అలాగే తక్కెళ్ళపాడు గ్రామంలో టీడీపీ నాయకులు, విగ్రహావిష్కరణ కమిటీ సమావేశం నిర్వహించారు. వివాదాస్పద విగ్రహావిష్కరణ కులాలు, మతాల మధ్య సమస్యగా మారుతుందని ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు.. ఆదివారం రాత్రి నిర్వాహకులు శ్రీకృష్ణుని రూపంలో ఉన్న విగ్రహాన్ని స్వచ్ఛందంగా తొలగించారు. అదే స్థానంలో ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడంతో వివాదాలకు తెరపడటంతో పాటు శాంతియుత వాతావరణం నెలకొంది. ఎటువంటి వివాదాలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఈనెల 24వ తేదీ ఆవిష్కరించిన శ్రీకృష్ణుని రూపంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహం



ఈనెల 25న ఏర్పాటు చేసిన విగ్రహం

అర్జీలు పునరావృతం కాకూడదు

జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 58 మంది అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీకు వివరించారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఎస్పీ జిల్లాలోని పోలీస్ అధికారులతో మాట్లాడుతూ మహిళలు, వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోపు చట్టపరిధిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సంపూర్ణ నివేదికను జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమన్నారు. సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ సీఐ యు.శ్రీనివాసరావు, జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులను ప్రోత్సహిస్తే చర్యలు



వేమూరు: బెల్టు షాపులను ప్రోత్సహించే మద్యం షాపు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఒంగోలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి విజయ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో నమోదైన మద్యం కేసులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం షాపుల నిర్వాహకులు ప్రభుత్వం నిబంధనల ప్రకారం విక్రయాలు చేయాలన్నారు. ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు నమోదైన మద్యం కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ రవి కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

28న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 28న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ పి.గోపాల్‌సింగ్ సోమవారం ఓప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్దిదారులతో పరస్పరం ముఖా ముఖిగా చర్చలు జరుగుతాయని తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని పెర్ల్ డిస్టలరీస్, బాపట్లలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్, సత్తెనపల్లిలోని శ్రీరాఘవేంద్ర బాలకుటీర్‌లో నిర్వహించనున్న నిధి ఆప్‌కే నికత్‌లో పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చెరువులో పడి యువకుడు గల్లంతు

కొల్లూరు: చెరువులో పడి ఓ యువకుడు గల్లంతైన సంఘటన కొల్లూరు శివారు బోస్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. బోస్ నగర్‌కు చెందిన సభావత్తు గోపీనాయక్ (34) రోజువారి కూలిపనులు చేసుకుంటూ తల్లితో కలసి జీవనం సాగిస్తున్నాడు. అతని తల్లి అతని కుమార్తె వద్దకు పొన్నూరు వెళ్లడంతో సోమవారం రాత్రి సమీపంలోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్లాడు. తన పెద్దమ్మ ఇంటి వద్ద నుంచి తిరిగి వచ్చే క్రమంలో గ్రామాన్ని ఆనుకొని ఉన్న చెరువు వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో చెరువు పక్కనే నివసిస్తున్న ఓగృహిణి చీకట్లో చెరువు నీళ్లలో పడి గోపీనాయక్ కొట్టుమిట్టాడుతున్నట్లు గమనించి స్థానికులను అప్రమత్తం చేసింది. వారు టార్చ్‌లైట్ల సాయంతో వెతికేందుకు ప్రయత్నించినప్పటికీ అతని ఆచూకీ లభ్యం కాలేదు. యువకుడు గల్లంతైన సమాచారం అందుకున్న కొల్లూరు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా ప్రాంతానికి చేరుకొని స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. రాత్రి సమయం కావడంతో యువకుడి కోసం గాలించే అవకాశాలు లేకపోవడంతో గజ ఈతగాళ్ల సాయంతో వెతికించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. యువకుడు చెరువులో గల్లంతవడానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడవ్వాల్సి ఉంది.



చెరువులో యువకుడి గల్లంతుపై ప్రత్యక్ష సాక్షులను విచారిస్తున్న పోలీసులు

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం బుడంపాడు ఎస్టీ కాలనీలో బాల్యవివాహాలు, గిరిజన మహిళల్లో ఎర్లీ ప్రెగ్నన్సీ పై వారం రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని ఆడ పిల్లలకు, 21 సంవత్సరాలు నిండని పురుషులకు వివాహాలు చేయరాదన్నారు. అలా చేయడం చట్టపరంగా నేరమన్నారు. ఆ వయసులో వారు శారీరకంగా, మానసికంగా వివాహాలకు సిద్ధంగా ఉండరని, చదువుకోవడం ముఖ్యమన్నారు. గిరిజన మహిళలు ఎర్లీ ప్రెగ్నెన్సీ వలన అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి అవగాహన కల్పించాలన్నారు.

పండుగ తరువాతే పరిశీలన

- 28 నుంచి డీఎస్సీ–2025 మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన
- ఉమ్మడి జిల్లాలో భర్తీ చేయనున్న 1,143 పోస్టులు
- గుంటూరు ఏసీ కళాశాలలో ముమ్మర ఏర్పాట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ వినాయకచవితి పండుగ తరువాతే ప్రారంభం కానుంది. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ–2025 ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులతో వివిధ కేటగిరీల వారీగా ఆయా పోస్టులకు ఎంపికైన వారికి పాఠశాల విద్యాశాఖ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఈనెల 28 నుంచి చేపట్టనుంది. విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం ప్రారంభం కావాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను మంగళవారానికి వాయిదా వేసిన అధికారులు వినాయకచవితి పండుగ సెలవు దృష్ట్యా మరోసారి వాయిదా వేశారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను గురువారం నుంచి చేపట్టేందుకు షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ‘సాక్షి’కి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో 1,143 పోస్టులు

డీఎస్సీ–2025 ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో 1,143 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ 622, ఎస్జీటీ 521 ఉన్నాయి. వీటితో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరో 16 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా తెలుగు 42, హిందీ 57, ఇంగ్లిష్ 69, మ్యాథ్స్ 35, ఫిజికల్ సైన్స్ 58, బయాలాజికల్ సైన్స్ 86, సోషల్ 109, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166తో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 521 ఉన్నాయి.



ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

ఏసీ కళాశాల వేదిక

ఉమ్మడి గుంటూరు జిల్లాలో భర్తీ చేయనున్నట్లు డీఎస్సీ నోటిఫికేషన్‌లో పొందుపర్చిన 1,143 పోస్టులకు గతంలో 25,067 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ పోస్టులకు గల అర్హత ప్రాతిపదికన సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఒక దరఖాస్తు దాఖలు చేసిన అభ్యర్థులతో పాటు రెండు పోస్టులకు కలిపి దాఖలు చేసిన దరఖాస్తులతో కలుపుకొని ఆన్‌లైన్‌లో మొత్తం 43,570 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో పురుషులు 8,431, మహిళా అభ్యర్థులు 16,636 మంది ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 6వ తేదీ నుంచి జరిగిన ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పరీక్షల ఫలితాలను ఇటీవల విడుదల చేశారు. వీరిలో ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను గురువారం నుంచి గుంటూరులోని ఏసీ కళాశాలలో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు విద్యాశాఖ కార్యాలయం ద్వారా నేరుగా సమాచారాన్ని పంపుతారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు చేపడతామని డీఈఓ సీవీ రేణుక చెప్పారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
మా సంస్థ నిర్వహించు తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షలను మీ జిల్లాలో నిర్వహించుటకు ఆసక్తి కలిగిన తెలుగు, హిందీ ఉపాధ్యాయులు లేదా స్త్రీ పురుష అభ్యర్థులు కావలెను.
Salary: 10,000/- +T.A, D.A
మన సంస్కృతి
Cell: 73960 49947

PRISM PHARMA INDIA PVT.LTD
Medical Representatives for GUNTUR
All India operating Pharma Company, wanted Medical Representatives in any Graduates Age below-35. Minimum experience 1 year. Salary 25,000/- and Allowances 10,000/- on confirmation. Interested career mind candidates Call for interview R M - 9790967033.

WANTED
AUTO CAD Design Engineer - 2 No's
CNC LASER Machine Operators - 2 No's
HVAC DUCT Marketing - 1 No's
UNITED ENGINEERINGS Auto Nagar, Guntur 9943550545

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE
■ మెగా అవకాశం ఫామ్‌ల్యాండ్ ఎకరం తీసుకున్న వారికి గజం 789/- మాత్రమే. 5 నుండి 60వ సంవత్సరం వరకు ఏటా 10 నుండి 15లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. Ph:9133574455

PLOT FOR SALE
■ గుంటూరు Ch పేట హైవేలో 100 పడకల ESI హాస్పిటల్‌ని నిర్మించబడుతున్న చినకోండ్రపాడు నడింపాలెం దగ్గర ఓపెన్ ప్లాట్స్ అమ్మకం. 20% పండుగ Discount. 8331095126, 9100752099

SERVICES

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్: 81422 92071
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. 88024 89999
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ 8790741166

WANTED
■ ప్రముఖ విద్యాసంస్థ నందు పని చేయుటకు లేడి రిసెప్షనిస్ట్ కం లేడీ టెలికాలర్ కావలెను. బ్రాడీపేట, 2/11, గుంటూరు. 8008145999

■ కమ్మజన సేవాసమితి గుంటూరులోని వసతి గృహంలో కంప్యూటర్ DTP తెలుగు, ఇంగ్లీషు అనుభవం కల్గిన మహిళ అభ్యర్థి కావలెను. 95733 82906
■ మంగళగిరి, తెనాలి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అ: డిగ్రీ, జీ: 15000+3000. సంప్ర: 91214 69383
■ తెనాలిలోని ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు అనుభవం గల సూపర్వైజర్ కావలెను. (M) ఆకర్షణీయమైన జీతం. ఫోన్: 86869 35606
■ గుంటూరు సిటీలోని ప్రముఖ హాస్పిటల్‌కి హౌస్‌కీపింగ్ స్త్రీలు జీతం 10 వేలు & వార్డు బాయ్స్ జీతం 12 వేలు అర్జెంటుగా కావలెను. 12 గం॥ డ్యూటీ. 85209 77729, 96423 13999
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్. జీ: 18K. Ph: 9640400073, 9160900024

గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.